క్లుప్తంగా

పశువుల తొట్టెల నిర్మాణం పూర్తి

దేవరపల్లి: గ్రామాల్లో పశువుల దాహార్తిని తీర్చడానికి ఉపాధి హామీ పథకంలో చేపట్టిన నీటి తొట్టెల నిర్మాణాలు పూర్తయినట్టు ఏపీఓ జీవీ శ్రీనివాస్ తెలిపారు. రహదారుల పక్కన వీటిని నిర్మిస్తున్నట్టు చెప్పారు. మండలానికి 18 తొట్టెలు మంజూరు కాగా, 15 పంచాయతీల్లో వీటి నిర్మాణం పూర్తయినట్టు వివరించారు. ఒక్కొక్క తొట్టె 300 లీటర్ల సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఒకొక్క తొట్టెను రూ.33.228 వ్యయంతో నిర్మించినట్టు తెలిపారు.

రెండు వర్గాలుగా ఎన్టీఆర్ జయంత్యుత్సవం

దేవరపల్లి: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతిని దేవరపల్లి గ్రామంలో టీడీపీ నేతలు రెండు వర్గాలుగా నిర్వహించడం చర్చనీయాంశమైంది. స్థానిక బస్టాండ్ వద్ద నున్న ఎన్టీఆర్ విగ్రహానికి ఆయా వర్గాల నాయకులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు కేకులు కట్ చేసి, వేర్వేరుగా వేడుకలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాలు జరిగాయి.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



మాజీ మంత్రి చెల్లుబోయినకు మొక్కను అందజేస్తున్న పితాని హరికృష్ణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీలో పదవులు పొందిన ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సూచించారు. బుధవారం బొమ్మూరు పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన పితాని హరికృష్ణ మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను మర్యాద పూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై దృష్టిసారించి ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కట్టా సత్యసురేష్ (జమీందార్), గుబ్బల నాగార్జున, నరాల శ్రీనివాస్, బడుగు చిన్ని, పెన్నాడ జయ, పలివెల భాస్కరరావు, పితాని శ్రీనివాసరావు, శీలు జాన్, పితాని సుభాష్, యనమదల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ డీఎస్సీ విజయవంతం

కంబాలచెరువు: డీవైఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ డీఎస్సీ విజయవంతమైందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యర్థులంతా ప్రణాళికబద్ధంగా చదుకోవాలని అన్నారు. అలాగే రోజూ న్యూస్ చూసి ఎప్పటికప్పుడు జనరల్ నాలెడ్జ్ తయారు చేసుకోవాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు మాట్లాడుతూ నగరంలో మూడు కేంద్రాల్లో మోడల్ డీఎస్సీ జరిగిందన్నారు. ఈ పరీక్ష పత్రాన్ని ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తయారు చేశారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్, రాజేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు టి.రాజేష్, బి.పవన్, బి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పదెకరాల భూమి కేటాయించండి

కడియం: అమరావతిలో సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ద్వారా రైతులకు ఉపయోగపడే విధంగా పదెకరాల భూమిని కేటాయించాలని అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని మంత్రి కార్యాలయంలో ఆయన్ని కలసి వినతి పత్రం అందించినట్లు చెప్పారు. ఈ స్థలంలో బొటానికల్ గార్డెన్స్, ఎకో టూరిజం, ప్లాంట్ డైవర్సిటీ కేంద్రం ఏర్పాటు చేసే విధంగా కేటాయించాలన్నారు. పాలకవర్గ సభ్యులు కొండేపూడి నాగు, తాడాల నాగేశ్వరరావు, గాజుల రత్తయ్య, రత్నం బాబ్జి, గాద నాగేశ్వరరావు, క్రొవ్విడి వాసు తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల నిషేధ చట్టంపై అవగాహన

కంబాలచెరువు: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టంపై ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లకు స్థానిక జిల్లా న్యాయస్థానం ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించేందుకు చేసిన ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. లైంగిక వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి కార్యాలయంలో ఈ విషయాలపై ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. సంస్థలో లైంగిక వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకునేందుకు ఆ సంస్థకు సంబంధించిన అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఉంటుందన్నారు. ఇబ్బంది ఎదురైన వెంటనే ఈ కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు.

విజ్ఞాన, వినోదాల వేసవి శిబిరం

- సత్ఫలితాలిస్తున్న శిక్షణ తరగతులు
- చిన్నారుల వికాసానికి దోహదం
- దూబచర్లలో 13 ఏళ్లుగా పలు అంశాల్లో శిక్షణ

నల్లజర్ల: వేసవి సెలవుల్లో హాయిగా ఆడుకోవచ్చు. బంధువుల ఇళ్లకెళ్లవచ్చునని పిల్లలు భావిస్తుంటారు. ఇందుకు భిన్నంగా నేటితరం బాలలు వేసవి సెలవులు సద్వినియోగం చేసుకుంటూ విజ్ఞానం పెంచుకుంటున్నారు. తోటిపిల్లలతో కలసి ఆడుకుంటూ వివిధ అంశాల్లో పట్టు సాధిస్తూ ముందుకు సాగుతున్నారు. నల్లజర్ల మండలం దూబచర్లలో 13 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ సౌజన్యంతో యోగా గురువు దూబగుంట్ల రాజారావు ఆధ్వర్యంలో విభిన్న అంశాల్లో ప్రావీణ్యం సంపాదిస్తున్నారు. చదరంగం, యోగా, వాలీబాల్ తదితర అంశాలపై పట్టుసాధిస్తున్నారు. ఈనెల 31తో ఈ వేసవి శిక్షణ శిబిరం ముగియనుంది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు యోగా శిక్షణ, 7 నుంచి 8 గంటల వరకు చెస్‌లో ప్రత్యేక శిక్షణ. 7 నుంచి 9 గంటల వరకు వాలీబాల్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బాలబాలికలలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఈ వేసవి విజ్ఞాన శిబిరాలు దోహదపడతాయని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. వేసవి సెలవుల్లో చిన్నారులు స్మార్ట్ ఫోన్లు, టీవీలకు అతుక్కుపోకుండా వారు చదువులో రాణించేందుకు ఈ తరహా శిబిరాలు తోడ్పడతాయని చెబుతున్నారు.



వేసవి శిబిరంలో యోగా శిక్షణలో విద్యార్థులు

13 ఏళ్లుగా శిక్షణ శిబిరం



దూబచర్లలో ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 13 ఏళ్లుగా వేసవి శిబిరాలు నిర్వహించి ఎంతో మంది విద్యార్థులకు యోగా, చెస్, వాలీబాల్‌లో శిక్షణనిచ్చాం. చదువుతో పాటు ఆటలు, పాటలు అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలకు చెందిన లక్షణాలు విద్యార్థుల్లో ఉంటాయని వాటిని వెలికితీసి ప్రోత్సహించి ముందుకు నడిపేందుకు ఈ తరహా శిక్షణ శిబిరాలు తోడ్పడతాయి.

– **దూబగుంట్ల రాజారావు**, శిబిర నిర్వాహకులు, పీఈటీ, దూబచర్ల హైస్కూలు

సెలవులు వృథా కాకుండా..



వేసవి సెలవులు వృథా కాకుండా వేసవి శిబిరంలో యోగాసనాలు, చదరంగంలో మెళకువలు నేర్చుకుంటున్నాను. మానసిక వికాసంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందింది.

– **తొంటా భాగ్యశ్రీ**, విద్యార్థి, దూబచర్ల

చదరంగంపై ఆసక్తి



నాకు చదరంగం అంటే చాలా ఇష్టం. ఇక్కడ శిక్షణ శిబిరానికి హాజరై చదరంగంలో మెళకువలు నేర్చుకుంటున్నాను. వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవడం ఆనందంగా ఉంది.

– **మీగడ చందన**, విద్యార్థి, దూబచర్ల

వాలీబాల్‌లో శిక్షణ



నెల రోజులుగా వాలీబాల్‌లో శిక్షణ పొందుతున్నా. పీఈటీ రాజారావు మాస్టారు ఈ క్రీడలో మెళకువలు నేర్పారు. జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనడానికి అవసరమైన మెళకువలన్నీ ఈ శిబిరంలో నేర్చుకున్నాను.

– **బోడిశెట్టి సచిన్**, విద్యార్థి, దూబచర్ల

మెరుగైన పారిశుధ్య నిర్వహణే లక్ష్యం



చాగల్లులో పారిశుధ్య నిర్వహణ వాహనాలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చాగల్లు: మెరుగైన పారిశుధ్య నిర్వహణే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి అన్నారు. పంచాయతీలో సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ కోసం కొనుగోలు చేసిన రెండు వాహనాలను బుధవారం సర్పంచ్‌తోపాటు మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మహ్మద్ ఆలీ మాట్లాడుతూ ఇప్పటికే పంచాయతీకి పారిశుధ్య నిర్వహణ కోసం మూడు ట్రాక్టర్లు, వ్యాను ఉన్నాయని తెలిపారు. ఇరుకు వీధుల్లో సులభంగా నడిపే విధంగా ఒక్కొక్కటీ రూ.1.80 లక్షల చొప్పున రెండు గ్రీన్ వాహనాలను పంచాయతీ నిధులతో కొనుగోలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పి శ్రవణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు గంట్రోతు సూర్యనారాయణ పాల్గొన్నారు.

గంగానమ్మ జాతరకు వేళాయె



గంగానమ్మవారు

నల్లజర్ల: పోతవరం గ్రామస్తుల ఆరాధ్యదైవం, గ్రామదేవత గంగానమ్మ జాతర ఈ నెల 29 నుంచి ప్రారంభం కానుంది. జూలై 15 వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. 39 ఏళ్ల తర్వాత గ్రామపెద్దలు అమ్మవారి జాతర నిర్వహించేందుకు నిర్ణయించి ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో 12 ఏళ్లకోసారి అమ్మవారి జాతర నిర్వహించేవారని గ్రామస్తులు తెలిపారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఈ కారక్రమం నిర్వహిస్తున్నారు. ఈ విద్యుత్ దీపాలతో వీధులను అలంకరించారు. గురువారం ఉదయం 8 గంటలకు ఆలయానికి, ఊరి పొలిమేరలకు మామిడి తోరణాలు కట్టే కార్యక్రమంతో జాతర మహోత్సవం ప్రారంభం కానుంది. అనంతరం గణపతి పూజ, గంగానమ్మ తల్లికి అభిషేకాలు, మంగళహారతి, నైవేద్యాల సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అమ్మవారిని గుడి నుంచి అత్తవారింటికి తీసుకువచ్చి అక్కడి నుంచి పుట్టింటికి తీసుకువచ్చి పొన్పులు వేస్తారు. ఈ సందర్భంగా బంధువులు రాకతో గ్రామం అంతా సందడి వాతావరణం నెలకొంది. పసుమర్తి కృష్ణ కుటుంబీకులు పుట్టింటి వారుగా, గంటా కృష్ణ కుటుంబీకులు అత్తింటి వారిగా వ్యవహరిస్తున్నారు.

రహదారుల నిర్మాణాలకు నిధుల మంజూరు

నిడదవోలు : నియోజవర్గంలో రహదారుల నిర్మాణాలకు నాబార్డు నిధులు రూ.7.37 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో 11.60 కి.మీల మేరకు 4 పనులను చేపడతామన్నారు. ఉండ్రాజవరం మండలంలోని పైడిపర్రు–సత్యవాడ, పెరవలి మండలంలోని కానూరు – నడుపల్లి కోట, కాపవరం – కొత్తపల్లి అగ్రహారం, నిడదవోలు మండలంలోని సింగవరం – నందమూరు రహదారులను అభివృద్ధి చేస్తారు. నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తామన్నారు. నాబార్డు నిధులతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యమన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నాకుమారి, కమిషనర్, ప్రజలు



మండల పరిషత్ కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు,పంచాయతీ సిబ్బంది

తాళ్లపూడి(కొవ్వూరు): నిరంతర యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నాకుమారి అన్నారు. కొవ్వూరులోని ఆంధ్రా గీర్వాణ విద్యా పీఠం వద్ద బుధవారం యోగాంధ్ర శిబిరం– 2025 కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నాకుమారి పాల్గొని పట్టణంలోని ప్రజలకు యోగాపై అవగాహన కల్పించారు. ధ్యానం, యోగాసానాలు సాధన చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి నాగేంద్రకుమార్, ఆయూష్ మెడికల్ ఆఫీసర్ కె శ్రీ విద్య, ఎంఈవో రామకిషోర్, మాస్టర్ ట్రేనీలు అల్లూరి కృష్ణారావు, శ్రీనివాసరావు, సరోజిని పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

నల్లజర్ల: యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ సింహాద్రిరావు విజ్ఞప్తి చేసారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు యోగాంధ్ర కార్యక్రమంపై ఆయన అవగాహన కల్పించారు. యోగా సాధనతో ఆరోగ్యంగా జీవించవచ్చని ఆయన తెలిపారు. అనంతరం యోగా గురువు దూబగుంట్ల రాజారావు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



ఉండ్రాజవరంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ సిబ్బంది

ఉండ్రాజవరం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యుడు ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం–2 సచివాలయం పరిధిలో బుధవారం రుతుక్రమం, ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత – పౌష్టికాహారంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత వలన వ్యాధులు సోకకుండా ఉంటాయన్నారు. హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ సౌజన్యంతో ర్యాలీలో పాల్గొన్న బాలికలకు శానిటరీ న్యాప్‌కిన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్‌నర్స్ కుమారి, సీనియర్ ట్రీట్మెంట్ పర్యవేక్షకులు ఆశాజ్యోతి, విజయలక్ష్మి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు సత్యవతి, భాగ్యలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నల్లజర్ల: రుతుచక్రం ప్రతి మహిళలో కలిగే సాధారణ ప్రక్రియ అని ఆ కాలంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పీహెచ్‌సీలో అంతర్జాతీయ మెన్‌స్ట్రువల్ హైజీన్ డే పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్టు అధినేత ఇవాంజలిన్ అశోక్ మాట్లాడుతూ 9 నుంచి 18 ఏళ్ల వయసులో ప్రారంభమయ్యే ఈ ప్రక్రియ ప్రతినెలా 5 రోజుల పాటు ఉంటుందన్నారు. మూఢనమ్మకాలతో కొంతమంది నేటికి ఆ సమయంలో స్త్రీలతో పాటు బాలికలను దూరంగా ఉంచడం విచారకమన్నారు. వీటికి స్వస్తి పలికి ఆరోగ్య సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలన్నారు. దీనికి సంబంధించిన అవగాహన చార్టులను మహిళలకు చూపించారు. మహిళల వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యసూత్రాలపై పాటించాల్సిన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు జీవివి ప్రసాద్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటును అడ్డుకున్న గ్రామస్తులు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం ఎస్సీ ఏరియాలో నూతన సెల్ టవర్ ఏర్పాటును స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. ఏ విధమైన అనుమతులు లేకుండా సెల్ టవర్ నిర్మిస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. సెల్ టవర్ రేడియేషన్ వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సెల్ టవర్ ఏర్పాటుకు జిల్లా ఉన్నతాధికారుల నుంచి తమకు అనుమతులు ఉన్నాయని సంబంధిత ప్రతినిధులు చెబుతున్నారని పంచాయతీ కార్యదర్శి జీవీ నాగరాజు తెలిపారు. సెల్ టవర్ ఏర్పాటుకు సంబంధించి పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదని ఆయన పేర్కొన్నారు.

జూన్ నుంచి రేషన్ డిపోలోనే సరకులు



పందలపర్రులో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు నాయక్

నిడదవోలు రూరల్: జూన్ నెల నుంచి రేషన్ కార్డుదారులు తమ సరకులను రేషన్ డిపోల్లో తీసుకోవాలని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ సూచించారు. మండలంలోని పందలపర్రు, డి.ముప్పవరంలోని రేషన్ దుకాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరాజు నాయక్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎండీయూ వాహనాల్లో రేషన్ అందించేవారని, ఆ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయడంతో రేషన్ కార్డుదారులందరూ స్వయంగా వెళ్లి తెచ్చుకోవాలన్నారు. వీటికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. డీలర్లకు మార్గదర్శకాలు అందజేశామని చెప్పారు. ఈకార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ ఎం.అనిల్‌కుమార్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పశువుల సంచారంపై చర్యలేవీ ?

- రోడ్లపై గుంపులుగా తిష్టవేస్తున్న మూగ జీవాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



నిడదవోలులో కారు కింద ఇరుక్కుపోయిన లేగదూడను బయటకు తీస్తున్న ప్రయాణికులు

నిడదవోలు : పట్టణంలో ప్రధాన రహదారులపై పశువుల సంచారం అధికమైంది. రోడ్లపై పశువులు గుంపులుగా తిష్టవేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఈ విషయంపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందన కరువైంది. పట్టణంలోని యర్నగూడెం రోడ్డుపై పశువులు తిష్టవేయడంతో వాటిలో ఓ లేగదూడ ప్రమాదానికి గురైంది. రోడ్డుకు అడ్డంగా లేగదూడ రావడంతో దానిపై నుంచి కారు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారు కింద లేకదూడ ఇరుక్కుపోయింది. దీంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ప్రయాణికులు, స్థానికులు కలిసి కారును పైకి లేపి ఇరుక్కుపోయిన దూడను అతికష్టం మీద బయటకు తీశారు. లేగదూడ గాయపడి ప్రాణాలతో బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పశువుల యజమానులు నిర్లక్ష్యంగా వాటిని బయటకు వదలడంతో అవి గుంపులుగా పట్టణంలోని ప్రధాన సెంటర్లలో సంచరిస్తున్నారు. దీంతో ప్రధాన రోడ్లపై రాకపోకలు సాగించే వాహనాలు, ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

భాగ్యనగర్ క్లోరైడ్ ఫ్యాక్టరీ వద్ద కార్మికుల నిరసన




గోపవరం ఫ్యాక్టరీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

గోపాలపురం: ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టిన నాటి నుంచి పనిచేస్తున్న కార్మికులను ఒక్కసారిగా తొలగించడంపై కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. గోపాలపురం మండలం గోపవరం భాగ్యనగర్ క్లోరైడ్ ఫ్యాక్టరీ వద్ద బుధవారం కార్మికులు ప్రధాన ద్వారం వద్ద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. క్లోరైడ్ ఫ్యాక్టరీ యాజమాన్యం చేపడుతున్న ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా కార్మికులు ఇటీవల యూనియన్ ఏర్పాటు చేసుకున్నారు. యూనియన్ ఏర్పాటు చేసిన కార్మికులైన పెందుర్తి వెంకటనాయుడు, పెండ్యాల రామకృష్ణలను వయస్సు (50) దాటినందున ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో యూనియన్ ఏర్పాటు చేయడంపై యాజమాన్యం ఎట్టి పరిస్థితుల్లోనూ యూనియన్ ఏర్పాటు చేయరాదని కార్మికులను హెచ్చరించడంతో కార్మికులు ఫ్యాక్టరీ గేటు వద్ద యాజమాన్యం వంటెద్దు పోకడలకు నిరసనగా నినాదాలు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఫ్యాక్టరీ యాజమాన్యం, యూనియన్ నాయకులతో చర్చలు జరుపుతున్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు



బ్రాహ్మణగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం

చాగల్లు: మండలంలో బ్రాహ్మణగూడెం మెయిన్‌రోడ్డులో నూతనంగా నిర్మించిన 28 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన దాపర్తి సత్యనారాయణ, గోపాలకృష్ణవేణి దంపతులు, దాతల సహకారంతో స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. బ్రాహ్మణగూడెం, ఎస్ ముప్పవరం, ఊనగట్ల, దారవరం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

5న రౌండ్‌టేబుల్ సమావేశం

ఉండ్రాజవరం: జూన్ 5వ తేదీన అమరావతిలో నిర్వహించనున్న ఆంధ్ర మాదిగ సంఘాల రాష్ట్రస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశానికి నియోజకవర్గంలోని ముఖ్య నాయకులందరూ హాజరు కావాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చేట్టే సుజనరావు పిలుపునిచ్చారు. మండలంలో కాల్దారిలో బుధవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయ కర్త పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ సభాధ్యక్షత వహిస్తారని తెలిపారు.

విద్యపై ఆసక్తితోనే లక్ష్య సాధన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): చిన్నప్పటి నుంచే బాలికలు విద్యపై శ్రద్ధ చూపినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. బుధవారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో కిశోర బాలికలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థి చదువే ఆయుధంగా చేసుకుని.. ఉన్నత విద్యనభ్యసిస్తే భవిష్యత్తు బంగారు మయం అవుతుందన్నారు. కౌమార దశలో ఉన్న బాలికలు క్రమశిక్షణతో మెలగాలని, అప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. తాము చేస్తున్న వృత్తి పట్ల క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన వారికి తప్పక విజయం దక్కుతుందన్నారు. బాలికల చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వివాహమైన తర్వాత కూడా విద్యను అభ్యసించవచ్చన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించి, వస్త్రధారణలో వారికి మంచి సలహాలు ఇవ్వడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. సంప్రదాయ దుస్తులు ధరిస్తే మనకు కలిగే గౌరవ మర్యాదల పట్ల వారికి తెలియజేయాలన్నారు. సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి కె.విజయ కుమారి, రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య, జీజీహెచ్ వైద్యురాలు కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.